క్లుప్తంగా

బీసీ హాస్టళ్లపై సమీక్ష

కడప రూరల్: జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కడప నియోజకవర్గ బీసీ బీసీ హాస్టల్స్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాస్టల్లో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డైట్ బిల్లులు ఎంతవరకు రాలేదని పేర్కొన్నారు. బాలికల కాలేజీ వసతిగృహం పాడుబడిన ప్రైవేట్ భవనంలో నడుస్తుందని, వేరొక భవనాన్ని సమకూర్చాలని తెలిపారు. కార్యక్రమంలో కడప తహసీల్దార్ నారాయణరెడ్డి, కడప డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, హెచ్‌డబ్ల్యూఓలు ప్రసాద్, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విదానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభుని వ్రతం

కడప కల్చరల్ : కడప నగరం పాతకడపలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు మయూరం పార్థసారథి ఆధ్వర్యంలో తొలుత స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా పవిత్ర జలాలు, పరిమళ ద్రవ్యాలతో కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులచే అర్చకులు శ్రీ అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని నిర్వహింపజేశారు.

ఉక్కుపరిశ్రమ నిర్మాణంపై చొరవచూపాలని వినతి

వైవీయూ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించి వలసలను నివారించేలా చొరవ చూపాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె. శంకర్ కోరారు. మంగళవారం కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఓ. నాగేంద్రబాబు, వెంకటేష్, వేణు, శ్రీనాథ్, వినీల్ పాల్గొన్నారు.

సేవా తత్పరుడు 'గానుగపెంట'

కడప రూరల్ : విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఉత్తమ సేవా తత్పరుడని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష,సహాయ అధ్యక్షుడు లింగమూర్తి, గోవిందు నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో గానుగపెంట హనుమంతరావు 78వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్, సుబ్బారావు, తివిక్రమ్, అంజి పాల్గొన్నారు.

పశు సంవర్ధకశాఖ ఉద్యోగుల సంఘం చైర్మన్‌కు సన్మానం

కడప కార్పొరేషన్ : పశు సంవర్ధకశాఖ ఉద్యోగుల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన కడప బహుళార్ధ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నంద్యాల రాజశేఖర్ యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు కొప్పుల శివయాదవ్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న పీడిత వర్గాలు, బహుజనులు, కార్మిక, కర్షక వర్గాల బలోపేతం కోసం, వారు ఆర్థికంగా ఎదిగేందుకు రాజశేఖర్ యాదవ్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ యాదవ్, ఆవుల రవికుమార్‌యాదవ్, ఎస్.నరసయ్య యాదవ్, పెంచలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపు

కడప కల్చరల్ : స్థానిక బిల్టప్ సమీపంలోని ఆచార్ల కాలనీలో మంగళవారం శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి కీర్తిని పాటల ద్వారా ఆలపించారు. అనంతరం పల్లకీలో స్వామి చిత్రపటాన్ని కొలువు దీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆచార్ల కాలనీతో పాటు సమీప ప్రాంతాల్లో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరంచేసే కుట్ర



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను విద్యార్థులకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. కేంద్రంపై పోరాడి మెడికల్ సీట్లను పెంచాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్న సీట్లను వెనక్కి పంపడం దుర్మార్గమన్నారు. మెడికల్ కళాశాల సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లు పెరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేద విద్యార్థులకు ఇక్కడ చదువుకునే అవకాశం లభిస్తుంది.

– ఎ. రాహుల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు



మెడికల్ సీట్లు వద్దనడం ప్రైవేటీకరణ కోసమే



మెడికల్ కళాశాల సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖ రాయడం వెనుక ప్రైవేటీకరణ చేయడం కోసమేనన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయిస్తే పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. వైద్య విద్యను లక్షలు ఖర్చుచేసి చదవే శక్తి పేదలకు కష్టం. ఉన్న అవకాశాలను ప్రభుత్వం దూరం చేస్తే ఎలా చదువుకుంటారు?. పులివెందుల మెడికల్ కళాశాల పేద విద్యార్థులకు ఒక వరం. విద్యార్థులకు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి.

– వీరపోగు రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



పరీదానగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్



పాత బస్టాండు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న కార్మికులు

- అందమైన, ఆరోగ్యకరమైన కడపను తయారు చేయాలి
- నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : పర్యావరణం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కడప నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అన్నారు. అందమైన, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన నగరంగా కడపను తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పాత బస్టాండులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండు పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని సేకరించి శుభ్రపరిచారు. పరిశుభ్రతపై పౌరులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి :

కడప నగరంలోని పెద్ద కాలువల్లో ఉన్న పూడికను వెంటనే తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పరీదానగర్‌లో పర్యటించి డి.సిల్టింగ్ మిషన్ ద్వారా పూడికతీత పనులను, కాలువల్లోని వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు మురికి కాలువల్లో స్ప్రేయింగ్ చేయాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. కల్వర్టుల కింద ఉన్న చెత్తాచెదారం, పూడికను తొలగించి మురికి నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వార్డులో ప్రతిరోజు గ్యాంగ్‌వర్క్ ద్వారా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని, తద్వారా తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, డీఈ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, నగర పాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని పులివెందుల మెడికల్ కళాశాలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సీట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందులలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024 – 25 సంవత్సరానికి అడ్మిషన్లు చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు సవరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వము నేషనల్ మెడికల్ కమిషన్‌కు రాసిన ఉత్తరం పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోతారని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకొని అడ్మిషన్లు నిర్వహించకపోతే ఆందోళన తప్పదన్నారు. గత ప్రభుత్వంలో నూతనంగా ఏర్పాటైన మెడికల్ కాలేజీలలో నిర్మాణాలు పూర్తయిన పులివెందుల, పాడేరు కాలేజీలలో అడ్మిషన్లకు అనుమతించాలని గత విద్యాసంవత్సరమే ఎన్ఎంసీని కోరారన్నారు. అయితే సాంకేతిక కారణాలవల్ల తిరస్కరించడం వల్ల అనేకమంది విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యారన్నారు. ఈ విద్యా సంవత్సరం ఎన్ఎంసినే పులివెందుల మెడికల్ కళాశాలకు 50 అడ్మిషన్లు కేటాయిస్తూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరం రాయడం రాజకీయ కక్ష సాధింపు అన్నారు. ఇది కేవలం పులివెందుల విద్యార్థులకే నష్టం కాదని, రాష్ట్రంలో పోటీపడి చదివే ప్రతి విద్యార్థికి నష్టమన్నారు. సీట్ల కేటాయింపు, అడ్మిషన్లపై మాట్లాడుతుంటే వైద్య మంత్రి సత్యకుమార్ గతం గురించి గత ప్రభుత్వం గురించి మాట్లాడడం బాధ్యతరాహిత్యం అన్నారు. ముహూర్తం, తిధి నక్షత్రాలు చూసుకొని బాధ్యతలు తీసుకున్న మంత్రి సత్య కుమార్‌కు వైద్యం గురించి వైద్య విలువ ఏమి తెలుస్తుందని విమర్శించారు. వైద్య విద్యను దూరం చేయడం ద్వారా ప్రైవేటు మెడికల్ కళాశాలలకు డిమాండును కల్పించే కుట్రలు చేయడం అంటే అంతకంటే దుర్మార్గం ఇంకొకటి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేసి పులివెందుల మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు చేపట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసి బాదుల్లా గంగా సురేష్ పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దని ఆందోళన



కోటిరెడ్డి సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పులివెందుల వైద్య విద్య కళాశాలను విద్యార్థులకి దూరం చేయడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో వైద్య విద్యను విద్యార్థులకు దూరం చేయరాదని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. తన భాధ్యతను మరిచి ప్రైవేటుకు పట్టం కట్టడం దుర్మార్గమన్నారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావల్సిన ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో పులివెందులకు వచ్చిన 50 సీట్లకు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్ఎం సీకి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓపీ ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వలన కోల్పోయాం అని తెలిపారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచల చర్యగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రుద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, తరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు నెలకు రూ.3 వేల భృతి

కడప కల్చరల్ : వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న యువతకు నెలకు రూ. 3000 గౌరవ వేతనం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నెంబరు జే1/837/2024తో ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ తెలిపారు. జిల్లాలో వేద విద్య అభ్యసించి ఎలాంటి ఆదాయం లేని వారికి ఈ వేతనాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అర్హత గల వారు వెంటనే జిల్లా కేంద్రంలోని దేవదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి వివరాలు అందించాలని లేదా ఆయన నెంబరుకు వాట్సాప్ ద్వారా వివరాలను పంపాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏఆర్ పీసీగా పనిచేస్తూ మృతి చెందిన రేకం కృష్ణయ్య కుటుంబానికి సహచర ఉద్యోగులు అండగా నిలబడి ఆర్థిక కసాయం అందజేశారు. గతనెల 24వ తేదీన గువ్వలచెరువు మసీదు సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ రిమ్స్ ఆస్పత్రిలో రేకం కృష్ణయ్య మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సహచర ఉద్యోగులు దిగ్భ్రాంతి చెంది ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ఏపీఎస్‌పీ 1998 బ్యాచ్ అసోసియేషన్ వెల్ఫేర్ ద్వారా రూ. 58 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు అయ్యావారయ్య, సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, ఆంజనేయులు, ఉత్తమ్‌కుమార్, మల్లికార్జున, అంజిరెడ్డి, రఫీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

23న స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు పోటీలు

వైవీయూ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23వ తేదీన కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఇంజినీర్ పి. శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్, పెయింటింగ్, పోస్టర్ ప్రజెంటేషన విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 8,9,10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

జీఓ 85ను రద్దు చేయాలి

కడప రూరల్ : జీఓ నెంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు తెలిపారు. ఆ మేరకు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో వైఎస్సార్ జిల్లా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినయ్‌కుమార్, ట్రెజరర్ డాక్టర్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జీఓ నెంబరు 85ను రద్దుచేయాలన్నారు. అలాగే తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత

వైవీయూ: పర్యావరణ పరిరక్షణకు మానవుల ఆరోగ్యకరమైన జీవన విధానానికి మొక్కలు నాటి రక్షించడం అత్యవసరమం వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. విద్యాలయంలోని పర్యావరణ, జంతుశాస్త్ర విభాగాలు, జాతీయ సేవా పథకం యూనిట్ 1 2 ఆధ్వర్యంలో ×తల్లి కోసం ఓ మొక్క స్పెషల్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అంతా విభిన్న రకాలైన వృక్షజాతులతో విరాజిల్లుతోందని అన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ సుమిత్ర, డాక్టర్ ఎస్పీ వెంకటరమణ, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

యూసీఐఎల్ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వేముల మండలం ఎం.తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం సంస్థ పరిశ్రమలో ప్రమాదాలు, టైలింగ్ పాండ్ నిర్వహణలో అధికారుల వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యురేనియం పరిశ్రమలో ప్రమాదాలు టైలింగ్ పాండ్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణపై అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్ పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణ అనుబంధ శాఖల అధికారులతో తక్షణమే సమావేశం నిర్వహించాలన్నారు. చెన్నైలోని కేంద్ర కార్మిక శాఖ, ఫ్యాక్టరీ ఇనే కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారులు దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలో మానవ వనరుల సంరక్షణ, సంక్షేమంపై, టైలింగ్ పాండ్ వ్యర్థాలతో చుట్టుపక్క గ్రామాల భూములు సారవంతమైన భూములు బీడు భూములుగా మారడంతో పాటు రేడియేషన్ మూలంగా స్థానిక ప్రజలు అనారోగ్యాలకు గురివుతున్నారన్నారు. కార్మికులకు వేతనాల చెల్లింపులు, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపుపై తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలన్నారు.

నులి పురుగుల నుంచి విముక్తి కల్పించాలి

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి



బాలుడికి డీ-వార్మింగ్ మాత్రలు వేస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు నులి పురుగుల నుంచి విముక్తి కల్పించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని సాయిపేట అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారం ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు డీ-వార్మింగ్ ట్యాబ్లెట్లు పిల్లలకు మింగించాలన్నారు. ఏదైనా అనారోగ్యం బారిన పడిన పిల్లలకు బుధవారం కూడా పిల్లలకు అందేలా వేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సునంద, మెడికల్ ఆఫీసర్ శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గాంధీనగర్ హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వాడడం వలన యువత ఆరోగ్యం క్షీణించిపోయి మేధాశక్తి కోల్పోతున్నారన్నారు. దేశానికి వెన్నుముకగా ఉన్న యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం ఎంతో మంచిదన్నారు. మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించే విధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేయడం ఆనందంగా ఉందని కొనియాడారు. స్నేహం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడుతున్న యువతకు తల్లిదండ్రులు వాటి వల్ల కలిగే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు జూటురు విజయ్ కుమార్ ,అశోక్ ,సాయి పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఏఐఎస్‌బీ నూతన కార్యవర్గం

వైవీయూ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప ప్రభుత్వ ఐటీఐలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సరైన సదుపాయాలు లేక ఉపాధ్యాయులు కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. అలాగే సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు గత కొన్ని నెలలుగా మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెండింగులో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా అబ్దుతుల్లా, నగర కార్యదర్శిగా ఫయాజ్, నగర ఉపాధ్యక్షులుగా దిలీప్, ముబారక్, మహేష్, సహాయ కార్యదర్శులుగా చరణ్, అబ్దుల్లా, ఆసీస్, నగర కమిటీ సభ్యులు గా సుబహాన్ బాషా, పవన్, సుమంత్, నానిలను ఎన్నుకున్నారు.

వానపాముల ఎరువుల తయారీ లాభదాయం

కేవీకే కోఆర్డినేటర్ డా. వీరయ్య



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

వైవీయూ : వానపాముల ఎరువుల తయారీ ఎంతో లాభదాయకమని, ఇది ఒక కుటీరపరిశ్రమగా రైతులు మలుచుకోవచ్చని ఊటూకూరు కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. వీరయ్య పేర్కొన్నారు. కడప నగర పరిధిలోని ఊటుకూరు కేవీకేలో వానపాముల ఎరువుల తయారీపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు భూసారాన్ని పరీక్షించడం కోసం తక్కువ ఖర్చుతో అన్ని పోషకాలను మొక్కకు అందించే సేంద్రీయ ఎరువులలో ముఖ్యమైన ఎరువు వర్మీ కంపోస్ట్ అన్నారు. సేద్యవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ సాయిమహేశ్వరి మాట్లాడుతూ వర్షాధార పరిస్థితుల ఎక్కువగా ఉండటం వల్ల కేవలం వ్యవసాయ పంటల ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించడం కష్టమవతుఉన్న నేపథ్యంలో వానపాముల ఎరువుల తయారీ లాభసాటిగా ఉంటుందని తెలిపారు. అనంతరం వర్మీ కంపోస్టు తయారీకి అనుకూలమైన పరిస్థితులు, పరికరాలు, వాడదగిన వ్యర్థ పదార్థాలు, వానపాముల రకాలు, కంపోస్ట్ బెడ్ల నిర్మాణం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శిల్పకల, మహేష్‌బాబు, మానస, సురేష్, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 750 ప్యాకెట్ల నిత్యావసరాలు



లారీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం 750 ప్యాకెట్ల నిత్యావసర సరుకులను రూ. 5.35 లక్షల వ్యయంతో పంపిణీ చేసేందుకు తరలిస్తున్న లారీని ఏపీఎస్ పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా చేస్తున్న సేవలను అభినందనీయమన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. మనం చేసే సేవల వల్ల పేదలకు ఏదో ఒక రకంగా ఆసరాగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (కన్‌స్ట్రక్షన్), సామాజిక సేవా సంఘం అధ్యక్షులు డి.నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎంవీ చలపతి, ఈఈ (టెక్నికల్) హరిసేవా నాయక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హరితాంధ్ర కడపగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే మాధవీరెడ్డి



మొక్క నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : హరితాంధ్ర కడపగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయడంతోపాటు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప శివారు ప్రాంతంలోని నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ×స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి,ఇ తర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హరితాంధ్ర కోసం అడుగేద్దాం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం అనే పిలుపుమేరకు నగరవనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మన ఇంటి పరిసరాలు, వీధులు, మన నగరం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే భవిష్యత్ తరాల వారికి ఒక ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే తమ తల్లి లక్ష్మీనారాయణమ్మ పేరుమీదుగా మొక్కను నాటారు. కార్యక్రమంలో స్క్వాడ్ డీఎఫ్ఓ గురు ప్రభాకర్, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద కడప మున్సిపల్ కమిషనర్ వై వి నందన్, అడిషనల్ కమిషనర్ రాకేష్, అటవీ శాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.